క్లుప్తంగా

పాఠ్య పుస్తకాల పంపిణీ

ఆదోని టౌన్: ఆదోని పట్టణం 20వ వార్డు మండిగిరి ఏరియాలోని ఎలిమెంటరీ పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా నోటు, పాఠ్య పుస్తకాలను ఆదోని టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు సోమవారం పంపిణీ చేశారు. పాఠశాలలోని 200 మంది విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో సీట్లు పెంచాలి



తహసీల్దార్ మురళికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

కోసిగి: బడి ఈడు బాలికలను పాఠశాలలో చేర్పించేందుకు ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో సీట్లు పెంచాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్, మండల కార్యదర్శి అంజి కోరారు. ఈ మేరకు సోమవారం ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మురళీని కలిసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో దరఖాస్తు చేసుకున్న బాలికలందరికీ విద్యాలయాల్లో సీట్లు వచ్చేలా చూడాలన్నారు. ప్రతి తరగతికి కేవలం 40 సీట్లకే పరిమితం చేయడంతో చాలా మంది విద్యార్థులకు సీట్లు రాక చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. విద్యార్థి సంఘం నాయకులు హాజీ, నరసింహులు, జైశాలి, మనోజ్, రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికా విద్యను ప్రోత్సహించాలి

ఎమ్మిగనూరు టౌన్: జిల్లావ్యాప్తంగా ఉన్న కేజీబీవీలలో సీట్లు పెంచి బాలికల విద్యను ప్రోత్సహించాలని ఏఐఎస్‌ఎఫ్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సమీర్, అబ్దుల్ ఖాదర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డీటీ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. కరువు జిల్లాలో బాలికల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కేజీబీవీల్లో సీట్లు పెంచి, అర్హులైన వారికి అవకాశాలు కల్పించాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సెబ్ ఇన్‌స్పెక్టర్ పి.భార్గవ రెడ్డి

ఎమ్మిగనూరు టౌన్: పట్టణంలోని వీవర్స్ కాలనీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తదనంతరం మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించేలా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచాన్ని మాదక ద్రవ్యాల నుంచి విముక్తి చేయాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఏటా జూన్ 26న మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తున్నారని, ఈ సందర్భంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, కాంపిటీషన్లు పెద్ద ఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సమావేశం

కౌతాళం: ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు, వర్షాల వల్ల డయేరియా కేసుల నమోదు కాకుండా చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ జిల్లా ఉన్నతధికారుల ఆదేశాల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు అన్నారు. గ్రామాల్లో తాగునీటి ట్యాంకులను ఏప్పటికప్పుడు శుభ్రం చేయాలని, శుద్ధి చేసిన నీటినే గ్రామాలకు సరఫరా చేయాలని సూచించారు.

ఈరన్న స్వామికి అభిషేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు ఆలయ ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

అర్జీలను గడువులోపు పరిష్కరించాలి

- సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ



ఆదోనిలో అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టంలో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు.

ఆయా మండలాల నుంచి వచ్చిన సమస్యల్లో కొన్ని...

➡ ఆదోని మండలం మండిగిరి గ్రామ పంచాయతీకి చెందిన అనీష్ ఫాతిమా తనకు సొంతమైన సర్వే నంబర్ 204/బీ1లో 3.70 ఎకరాల భూమికి సంబంధించి ఆన్‌లైన్, పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.

➡ ఆదోని మండలం కల్లుబావి గ్రామంలో గత 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని, సదరు ఇంటి స్థలానికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేవని, దయచేసి పొజిషన్ సర్టిఫికెట్ మంజూరు చేయాలని కల్లుబావికి చెందిన బాలరాజు అర్జీ సమర్పించారు.

➡ టిడ్కో ఇంటి కోసం గతంలో లక్ష రూపాయలు బ్యాంకు డీడీ ద్వారా చెల్లించామని, ప్రస్తుతం టిడ్కో గృహం మంజూరు కాలేదని, బ్యాంకు డీడీ ద్వారా చెల్లించిన నగదును తిరిగి ఇవ్వాల్సిందిగా ఆదోని పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన దాసరి యశోద అర్జీ సమర్పించారు.

➡ ఆదోని మండలం గోనబావి గ్రామానికి చెందిన పక్కీరప్ప కుమార్తె వెన్నెల 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 8వ తరగతి బదులుగా 6వ తరగతి తప్పుగా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా కస్తూర్బా గాంధీ పాఠశాలలో 8వ తరగతి అడ్మిషన్ మంజూరు కాలేదన్నారు. దయచేసి తన కుమార్తెకు 8వ తరగతి అడ్మిషన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.

ఈ కార్యక్రమంలో కార్యాలయపు పరిపాలనాధికారి సి.ఆర్.శేషయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణారెడ్డి,, పంచాయతీరాజ్ ఈఈ వెంకటప్రసాద్, ఆర్డీ నాగేంద్ర, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టండి



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య

నందవరం: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..గ్రామాల్లో మురుగు కాలువలు, నీటి కుంటలు, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసేలా చూడాలన్నారు. 15వ ఆర్థికసంఘం నిధులను గ్రామాల్లో పరిశుభ్రత, తాగునీటి కోసం వినియోగించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాముడు, ఎంఈఓ-2 రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతాం

- పథకం ప్రకారమే పార్టీ ఫిరాయించనున్నట్లు తప్పుడు ప్రచారం
- వదంతులను నమ్మొద్దు
- మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ల వెల్లడి



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ నరసింహులు

ఆదోని టౌన్: ఎట్టి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీని వీడబోమని, పార్టీలోనే కొనసాగుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, వైస్ చైర్మన్లు ఎంఎండి గౌస్, నరసింహులు, కౌన్సిలర్లు తెలిపారు. సోమవారం చైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆదోని మున్సిపాలిటీలో భారీ ఎత్తున కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించనున్నట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని చెప్పారు. సగభాగం మంది కౌన్సిలర్లు వైఎస్సార్‌సీపీని వీడి, బీజేపీ (కూటమి)లోకి వెళ్లనున్నట్లు వస్తున్న వదంతులు నమ్మవద్దని చైర్‌పర్సన్ శాంత, వైస్ చైర్మన్లు అన్నారు. ఆదోని హిందూ శ్మశాన వాటికలో రూ.1.19 కోట్లు ఖర్చు చేసి రెండు శవపేటికలను కొనుగోలు చేశామని చెబుతూ నిధులను భారీగా దుర్వినియోగం చేశారనే ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కూటమి నాయకుడు ఉమ్మిసలీం వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. లేనిపోని అబద్ధాలతో ప్రకటనలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. శ్మశాన వాటికలో శవపేటికల కొనుగోలులో ఎలాంటి అవినీతి జరగలేదన్నారు. సంబంధిత కాంట్రాక్టర్‌కు ఒక్క రూపాయి బిల్లు కూడా మంజూరు కాలేదని, మంజూరైన నిధులు వెనక్కి మళ్లిపోయాయని తెలిపారు. వాస్తవాలను తెలుసుకోకుండా ఉమ్మిసలీం ఆరోపణలు చేయడం తగదన్నారు. రాంజల నల్ల చెరువులో పాచి, పూడిక, నీరు రంగు మారడం, కంపు వాసన వస్తుండడంతో నీటిని బయటకు పంపింగ్ చేసి చెరువును శుభ్రం చేయిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు ఫయాజ్‌అహ్మద్, రాజేశ్వరరెడ్డి, బాలాజీయాదవ్, నాగరాజ్, రామకృష్ణ, మహ్మద్‌స్వామి, గోవిందు, హాజీబాషా, రహిమాన్, ఆనందరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల అపహరణకు యత్నం

ఆదోని అర్బన్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ జయరామిరెడ్డి చాంబర్‌లో కొన్ని ముఖ్యమైన ఫైళ్లను తీసుకెళ్లేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. ఆర్‌ఐ జయరామిరెడ్డిని కొన్ని కారణాల వల్ల కర్నూలు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రిపోర్టు చేశారు. అయితే సోమవారం పట్టణంలో తహసీల్దార్ హసీనాసుల్తానా అనుమతి లేకుండా ఓ వ్యక్తి ఆర్‌ఐ చాంబర్ తాళాలు తీసి ముఖ్యమైన ఫైళ్లను తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. అక్కడున్న అధికారులు సదరు వ్యక్తిని నిలదీయగా ఆర్‌ఐ పీఏనంటూ బుదులిచ్చాడు. ఫైళ్లను అక్కడే పెట్టారా లేక తీసుకెళ్లారా తెలియాల్సి ఉంది. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆర్‌ఐను కలెక్టర్ కార్యాలయానికి రిపోర్టు చేశామని, చాంబర్ తాళాలను తనకు అప్పగించాలని ఆదేశించామన్నారు. అయితే ఎవరో వ్యక్తి తన అనుమతి లేకుండా ఆర్‌ఐ చాంబర్ తాళాలు ఎలా తీస్తారని, అతడు ఎవరో తెలుసుకుని చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వెల్లడించారు.

ఆక్రమణల తొలగింపు



కొత్త బస్టాండు వద్ద అక్రమ కట్టడాలను కూల్చివేసిన దృశ్యం

ఆదోని టౌన్: స్థానిక కొత్త బస్టాండు ఎదురుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం సాయంత్రం కూల్చి వేశారు. ఇందిరాగాంధీ విగ్రహం నుంచి ఆర్టీసీ డిపో వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న హోటళ్లు, బీడీ బంకులు, బేకరీలు, టీ హోటళ్లు, సెల్ షాపుల యజమానులు రోడ్డుపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను జేసీబీతో కూల్చి వేశారు. కొంతమంది వ్యాపారులు తమకు కొంత సమయం ఇవ్వాలని, తామే షెడ్లను తొలగిస్తామని చెప్పినా అధికారులు వినకుండా తమ పని తాము కానిచ్చారు. అక్రమంగా నిర్మించుకున్న షెడ్లు, మెట్లు, చెరుకు మిషన్లు, చిన్న చిన్న బంకులను సైతం తొలగించారు. దీంతో రోడ్డు విశాలమయ్యింది. దుకాణదారులు, వ్యాపారులు రోడ్డును ఆక్రమించి కట్టడాలు చేపడితే కూల్చివేస్తామని అధికారులు హెచ్చరించారు.

వృద్ధాశ్రమానికి విరాళం

కౌతాళం: మానవ సేవయే మాధవ సేవ అని కౌతాళం ప్రతిభ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానేశ్వరి, కార్యదర్శి మైనుద్దీన్‌లు అన్నారు. సోమవారం ఆదోనిలోని జీవనజ్యోతి వృద్ధాశ్రమానికి వెళ్లి వృద్ధులకు, వికలాంగులకు రెండవ తరగతి విద్యార్థులచే పాఠశాల యాజమాన్యం తరఫున పండ్లను పంపిణీ చేశారు. అలాగే ఆశ్రమ నిర్వాహకులు విక్టర్‌పాల్ ఫిలిప్‌కు రూ.5 వేలను విరాళంగా అందజేశారు. విద్యార్థులకు మొదటి బడి అమ్మ ఒడి అని తల్లిదండ్రులు కూడ మంచి నైతిక విలువలు కలిగేలా పిల్లలను తీర్చి దిద్దాలని అప్పుడే ప్రతి విద్యార్థి మన ఇంటి కుటుంబ సభ్యులతో పాటు, సామాజిక సేవ దృక్పథంలో ముందుంటారన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి



తహసీల్దార్ శేషారెడ్డికి వినతి పత్రం అందిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఎమ్మిగనూరురూరల్: విద్యాహక్కు చట్టాన్ని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో పకడ్బందీగా అమలు చేయాలని న్యాయవాది, సామాజిక కార్యకర్త ఏ.తిమ్మప్ప డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్ సెల్‌లో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి తహసీల్దార్ శేషారెడ్డి, ఎంఈఓ ఆంజనేయులుకు వినతి అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో చేరాలంటే ముందు ఫీజులు చెల్లించాలని యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులను వేధిస్తున్నాయన్నారు. పట్టణంలోని కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ అధిక ఫీజులు వసులు చేయడమే గాక అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయని చెప్పారు. జిల్లా విద్యాధికారులు స్పందించి విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు స్కూళ్లలో సీట్లు పొందిన విద్యార్థులను ఆయా యాజమాన్యాలు వేధించకుండా చూడాలని కోరారు.

ప్రైవేట్ స్కూళ్లు నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రామాంజనేయులు

నందవరం: ప్రైవేట్ స్కూళ్లు ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని ఎంఈఓ-1 రామాంజనేయులు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయంలో ఆయన ఇన్‌చార్జ్ ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి సెలవులో వెళ్లిపోవడంతో గోనెగండ్ల ఎంఈఓ-1గా పనిచేస్తున్న రామాంజనేయులును ఉన్నాతాధికారులు ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు పొందాలని, నిబంధనలు పాటించాలన్నారు. నింబంధనలు పాటించని పాఠశాలల అనుమతులను రద్దు చేస్తామని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో వంట ఏజెన్సీలు మెనూ పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని ఎంఈఓ వివరించారు. సీఆర్పీ ఉరుకుంద పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ అరూన్ రషీద్



మాట్లాడుతున్న ఎంపీడీఓ జనార్ధన్

కోసిగి: గ్రామీణ ప్రాంతాల్లో డయేరియా వ్యాధి ప్రభలకుండా అప్రమత్తంగా ఉండాలని ఈఓపీఆర్డీ అరూన్ రషీద్, కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మనోజ్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో అంటువ్యాధులు డయేరియా, మలేరియా, అతిసారం వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. వ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షపు నీరు, మురుగు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. డ్రయినేజీలు, తాగునీటి ట్యాంక్‌లను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడర్‌ను చల్లించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. తాగునీటి కుళాయిల వద్ద నీరు నిల్వ ఉండరాదని, పైప్ లైన్ల లీకేజీ ఉన్న చోట వెంటనే మరమ్మతులు చేయించేలా చూడాలన్నారు. ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినరాదని, కాచి వడబోసిన నీటినే తాగాలన్నారు. చిన్నపాటి జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలుంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. దీనిపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచ్‌లు, కార్యదర్శులకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మల్లికార్జున రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు ఉన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన కల్పించండి

పెద్దకడబూరు: అతిసార వ్యాధి నివారణపై మండల ప్రజలను అప్రమత్తం చేయాలని ఎంపీడీఓ జనార్ధన్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఈఓలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, పంచాయతీ కార్యదర్శులతో అతిసార వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో రక్షిత మంచినీరు సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికుమార్‌కు సూచించారు. శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఎంఈఓ రామమూర్తి, పంచాయతీరాజ్ ఏఈ మల్లయ్య, డాక్టర్ ఫిరదౌస్‌ఖానం తదితరులు పాల్గొన్నారు.

నీట్ అవకతవకలపై నిగ్గు తేల్చాలి



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌ఓ నాయకులు

ఆదోని సెంట్రల్: నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థులకు న్యాయం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ రాష్ట్ర నాయకులు తిరుమలేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు పీడీఎస్‌ఓ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా వివిధ ప్రశ్నాపత్రాల లీకేజీ జరుగుతున్నా అధికారులు గానీ, నాయకులు గానీ పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురికి, బీహార్, గుజరాత్ ప్రాంతాల్లో పరీక్ష రాసిన 67 మంది విద్యార్థులకు ఒకే మార్కులు ఏ విధంగా వస్తాయని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం వీటన్నింటికీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ స్కాంపై సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని, అక్రమాలు నిగ్గుతేలే వరకు కౌన్సిలింగ్‌ను వాయిదా వేయాలని కోరారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎస్‌ఓ నాయకులు శివ, గిడ్డయ్య, వీరేష్, ప్రవీణ్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలి

కౌతాళం: ప్రైవేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను అందించాలని ఏపీయూడబ్ల్యూజే యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం యూనియన్ ఆధ్వర్యంలో ఏంఈఓ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. కౌతాళంలో జర్నలిస్టులుగా పనిచేస్తున్న వారి పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు మినహాయించి ఉచిత విద్య అందించాలని కోరారు. గతంలో మాదిరిగా ఈ ఏడాది కూడా ఫీజు రాయితీ ఇచ్చేలా ఉన్నతధికారుల చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీయూడబ్ల్యూజే నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: అర్హత కలిగిన జర్నలిస్టుల పిల్లలకు కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో 60 శాతం ఫీజు రాయితీ కల్పించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు ఆరేకల్ దేవదాస్, తాలూకా అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జున, హుసేన్‌బాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ఎంఈఓ శ్రీనివాసులకు వినతి పత్రం అందజేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, సంక్షేమ పథకాలతో పాటు మూడు సెంట్ల ఇంటి స్థలం ఇచ్చి నిర్మాణం చేపట్టాలని కోరారు.

గోనెగండ్ల: ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో జర్నలిస్టుల పిల్లలకు 60 శాతం రాయితీ ఇవ్వాలని మండల జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మండల విద్య వనరుల కేంద్రంలో ఏపీడబ్ల్యూజేఏ ఆధ్వర్యంలో ఎంఈఓ-2 నీలకంఠకు వినతిపత్రం అందజేశారు.



మాట్లాడుతున్న నాయకులు

జయప్రదం చేయండి

ఆదోని రూరల్: జూలై 7వ తేదీన వరంగల్‌లో చేపట్టే మాదిగల ఆత్మగౌరవ సభను జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా నాయకులు బండారి హనుమంతు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బండారి గిడ్డయ్య మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం స్థానిక బుడేకల్ వార్డు అధ్యక్షుడు వన్నెల మల్లికార్జున, ఉపాధ్యక్షులు వీరేంద్ర, ప్రధాన కార్యదర్శి నామాల రాఘవేంద్ర, కార్యదర్శి సిద్దు, సహాయ కార్యదర్శి వెన్నెల స్వామి, కార్యవర్గ సభ్యులు వెన్నెల మహేష్‌తో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన వారు హక్కుల సాధనకై ఉద్యమిస్తామని తీర్మానం చేశారు. జూలై 7న వరంగల్‌లో జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాత్తు, సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు నరసింహులు, కాంతరాజ్, దత్తు, దేవరాజ్, శేఖర్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన రైతు మృతి

తుగ్గలి : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముక్కెళ్లకు చెందిన రైతు రాజశేఖర్ (27) మృతి చెందాడు. పొలం పనులు పూర్తి చేసుకుని ఆదివారం సాయంత్రం వేసుకుని ఇంటికి వెళ్లేందుకు ఎద్దుల బండి కడుతుండగా అదే సమయంలో బొందిమడుగుల నుంచి పత్తికొండ వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాజశేఖర్ తీవ్రంగా గాయపడటంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ కోలుకోలేక అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు సోమవారం తుగ్గలి పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో హెచ్‌ఎం మృతి



రామయ్య (ఫైల్)

తుగ్గలి: మండలంలోని రాతన గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం రామయ్య (61) అనారోగ్యంతో మృతి చెందారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు రెండు రోజుల క్రితం కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సంజామలకు చెందిన రామయ్యకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. హెచ్‌ఎం మృతి పట్ల ఎంఈఓలు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

జీఓ 117ను రద్దు చేయాలి



హనుమాపురంలో సభ్యత్వ నమోదు రసీదును అందజేస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: జీఓ నంబర్ 117ను రద్దుచేసి ప్రాథమిక పాఠశాలల ఉనికిని కాపాడాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వి.జి.వెంకట్ రాముడు, కార్యదర్శి రామన్న, కౌన్సిలర్ రవీంద్ర, రాఘవేంద్రరావు డిమాండ్ చేశారు. డీటీఎఫ్ (డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) పెద్దకడబూరు శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదులో భాగంగా వారు సోమవారం మండల పరిధిలోని చిన్నకడబూరు, పెద్దకడబూరు, హనుమాపురం, కంబలదిన్ని తదితర గ్రామాలలో పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. శాశ్వత ఉపాధ్యాయుల మాదిరిగానే పే స్కేల్ ఉండాలన్నారు. 20 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న జేఎల్ పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.